క్లుప్తంగా

మురుగుకాల్వలు లేక అవస్థలు



వరదనీరు కోసం తవ్వకాలు చేస్తున్న స్థానికులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు సంబంధించిన బైపాస్ రోడ్డుపక్క కాలనీలో మురుగుకాల్వలు లేవు. దీంతో వరదనీరు మట్టిరోడ్లుగా ఉన్న అంతర్గత రహదారులపై పారుతుండటంతో పాటు దిగువనున్న కొన్ని ఇళ్లలోకి ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో నిలుస్తోంది. అధికారులు స్పందించి కాలనీలో రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు సోమవారం ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన



కంగ్టి పెద్ద చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

కంగ్టి(నారాయణఖేడ్): జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సోమవారం మండలంలోని పలు చెరువుల పరిస్థితులు పరిశీలించారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండు కుండలా మారాయి. దీనికి తోడు వాతావరణ శాఖ భారీ వర్ష సూచనలు చేయడంతో ఆయా గ్రామాల్లో స్థానికులను అప్రమత్తం చేసే చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని దామర్‌గిద్ద, ముర్కుంజాల్, కంగ్టి చెరువులను పరిశీలించారు.

వర్షంలో జాగ్రత్తగా బస్సులు నడపాలి



డ్రైవరుకు సూచనలిస్తున్న ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా బస్సులను జాగ్రత్తగా నడపాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య డ్రైవర్లకు సూచించారు. సోమవారం ఖేడ్ రాజీవ్ చౌక్‌లో అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, పీఆర్‌ఓ పాండు, కంట్రోలర్ నెహ్రూనాయక్‌తో కలిసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గోతులను చూసుకొని బస్సులు నడపాలన్నారు. అద్దాలు తుడిచే వైఫర్ వేసుకోవాలన్నారు. ఆర్టీసీ పరంగా ఇబ్బందులు ఉంటే 9959223170, 9704885694 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయండి



కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల నిరసన

సంగారెడ్డి: గ్రేడ్ వన్ మున్సిపాలిటీ సంగారెడ్డిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఇందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆటో కార్మికులు తెలిపారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. పలువురు నేతలు వైఎస్‌ఆర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.



సంగారెడ్డి : వైఎస్సార్ భవన్‌లో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభు గౌడ్



రామచంద్రాపురం: బీరంగూడ చౌరస్తాలో వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద..



నారాయణఖేడ్: నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



పటాన్‌చెరుటౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జోగిపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం తరఫున అత్యవసర సహాయక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలతో పాటు, సాకి చెరువు, చిన్నవాగు, పాటి గ్రామ చౌరస్తాలోని సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ వివిధ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో పాటు నీరు చేరే అవకాశం ఉన్న ఇళ్లలోని ప్రజలను తరలించాలని ఆదేశించారు. ఇప్పటికే అత్యవసర రక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రామచంద్రపురంలో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికైతే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు.



కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

జహీరాబాద్ టౌన్: పద్మశాలీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా సోమవారం రాత్రి పద్మశాలి భవనంలో జహీరాబాద్ అధ్యక్షులు గడ్డం జనార్దన్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. ఐకమత్యంగా ఉంటూ అన్ని విధాలుగా ప్రగతిసాధించాలన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు జనార్ధన్, జిల్లా అధ్యక్షులు గుండు సత్యనారాయణ, మెదక్ అధ్యక్షులు జయరాం, జహీరాబాద్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులపై స్థానికుల ఆగ్రహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అధికారుల నిర్లక్ష్యంతో వరదనీరు రోడ్లు, కాలనీలోకి చేరుతున్నాయని, బిల్డర్లకు ఇష్టానుసారంగా ఎన్‌ఓసీలు ఇచ్చారని తెల్లాపూర్ వాసులు సోమవారం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్లపైకి వరద నీరు రావడంతో ఆర్‌ఎండీబీ ఎస్‌ఈ వెంకటేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ సంతోషిని క్షేత్రస్థాయిలో వరదకాలువలను పరిశీలించారు. ఆసమయంలో కొందరు రైతులు, తెల్లాపూర్ వాసులు ఇరిగేషన్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.



నారాయణఖేడ్: వెంకటాపూర్ శివారులో..



రాయికోడ్: కూలిన ఇంటి గోడ



కంది(సంగారెడ్డి): చిమ్నాపూర్ చెరువు అలుగు



మునిపల్లి(అందోల్): కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వాన.. హైరానా

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో చెరువులు, కుంటలు నిండి, అలుగు పారుతున్నాయి. అలాగే ఆయా గ్రామాల్లో చాలా ఇళ్లు కూలిపోయాయి. దీంతో వాటిని అధికారులు సోమవారం పరిశీలించారు.



ఝరాసంగంలో..బోరుబావి నుంచి వస్తున్న నీరు



సంగారెడ్డి సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ : నిండు కుండలా సంగారెడ్డి మహబూబ్ సాగర్‌చెరువు



సంగారెడ్డి అర్బన్: గీతానగర్ కాలనీ రోడ్డు



సంగారెడ్డి టౌన్ : ఫసల్వాది బ్రిడ్జి కింద..



సంగారెడ్డి రూరల్: రోడ్డు పై వరద నీరు



కంగ్టి: చాప్టా(కే) కొత్త చెరువు..

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

జహీరాబాద్ టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారని అన్నారు. అండర్-14, -17 బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ ఆటల పోటీల్లో ప్రథమ బహుమతులు గెలుచుకున్నారన్నారు. పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 33 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని అన్నారు.

కట్టు కాలువకు మరమ్మతులు

సంగారెడ్డి : హత్నూర మండలం దౌలాపూర్ చెరువులోకి నీళ్లు రాకపోవడంతో రైతులే స్వయంగా వెళ్లి జేసీబీ యంత్రం ద్వారా కట్టు కాలువకు మరమ్మతులు చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ మూసపేట్ గ్రామ శివారులో కట్టు కాలువను ధ్వంసం చేసి చెరువులోకి నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులోకి వరద నీరు రావడం లేదు. అనుమానించిన దౌలాపూర్ గ్రామ రైతులు వెళ్లి చూడగా మూసాపేట శివారులో కట్టు కాలువకు మట్టి గడ్డ అడ్డంగా ఉంది. దీంతో జేసీబీతో దానిని తొలగించారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని రైతులు వాపోయారు.

ప్రత్యేక పూజలు

జోగిపేట(అందోల్): శ్రావణ అమావాస్య సందర్భంగా శ్రీసత్యసాయిబాబా మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఉపేందర్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో కార్పొరేటర్ పుష్ప మర్యాదపూర్వకంగా కలసి డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాలతో రోడ్లు గుంతలమయంగా మారాయని తెలిపారు. అందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.



ఆమ్రపాలికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

తహసీల్దార్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొండాపూర్(సంగారెడ్డి): అక్రిడేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొండాపూర్ తహసీల్దార్ అనితకు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రిపోర్టర్‌లు అనంతయ్య, బాల్‌రాజ్, రాజు, అనిల్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కూలిన ఇళ్ల బాధితులకు తక్షణ సాయం అందించాలి

సదాశివపేట(సంగారెడ్డి): వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలించి బాధితులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని 12వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు మున్సిపల్ అధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని 12వ వార్డు పరిధిలో వర్షాలకు కూలిన ఇండ్లు, పగిలిపోయిన వాటర్ పైప్‌లైన్, మురుగునీటి కాలువలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాస్కర్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. అనిల్, రాము, అఖిల్, సాయికిరణ్, సోమశంకర్ ఉన్నారు.

రైతులు ఫొటో దిగాలి

మునిపల్లి(అందోల్): రుణమాఫీ కాని రైతులంతా వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర ఆధార్ కార్డు తీసుకుని వచ్చి ఫొటో దిగాలని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ రైతులను కోరారు. మండలంలోని బుదేరా రైతు వేదికలో సోమవారం రుణమాఫీ కాని రైతులు ఆధార్ కార్డుతో ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెహమాన్, స్నేహ, రైతులు పాల్గొన్నారు.

ముంపు కాలనీల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: భారీ వర్షాలకు ఎగువ ఉన్న ముత్తంగి, ఇస్నాపూర్ నుంచి వస్తున్న వరద నీరుతో చిట్కుల్ పంచాయతీ పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాలను కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పరిశీలించారు. సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ ఈఓతో కలిసి రాధమ్మ కాలనీ, నాగార్జున, పార్థసారథి కాలనీల్లో పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై భారీగా నిలిచిన నీటిని పరిశీలించారు. నిలిచిన నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.



వరద నీటిని పరిశీలిస్తున్న నీలం మధు

సంక్షిప్త వార్తలు

◆ **భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు**

సదాశివపేట(సంగారెడ్డి): చివరి శ్రావణసోమవారం కావడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని భ్రమరాంబ మల్లికార్జున, ఈశ్వర మార్కండేయ, శంభులింగేశ్వర, బంగారు మైసమ్మ, సంగమేశ్వర, బసవేశ్వర మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

◆ **నేడు జాబ్ మేళా**

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, ఈడీసీ, ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఎఫ్ సహకారంతో మంగళవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌ఎస్ రత్న ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని ఎంఆర్‌ఎఫ్‌లో 200 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2019 – 2024 మధ్యకాలంలో డిగ్రీ చేసిన పురుష విద్యార్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో, ఐదు పాస్ ఫోటోలు తీసుకొని రావాలన్నారు.

◆ **ఆ నలుగురి అంత్యక్రియలు పూర్తి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మానసిక ఆందోళనకు గురై జీవితంపై విరక్తి కలిగిన ఓ మహిళ తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం పటాన్ చెరు మండలం రుద్రారంలో చోటు చేసుకున్న విషయం విదితమే. కాగా సోమవారం వారి స్వగ్రామమైన సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామంలో సువర్ణ(28), వారి ముగ్గురు పిల్లలు జస్వంత్(05), చిన్మయి(03), చిత్రనాథ్(03) అంత్యక్రియలు నిర్వహించారు.

◆ **ఆలయాల్లో శ్రావణ శోభ**

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ఉమాపార్థివ లింగార్చన సహిత కుంకుమార్చన నిర్వహించారు. 108 శివ లింగాలను తయారు చేసి, పూజలు చేశారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఖేడ్ కాశీనాథ్ మందిరంలో మహారుద్ర యాగం నిర్వహించగా.. ఎంపీ సురేశ్‌షెట్కార్ సతీమణి ఉమాదేవీ షెట్కార్, ఖేడ్ మాజీ జెడ్పీటీసీ సంగీత పాల్గొన్నారు.

◆ **భద్రకాళి, వీరభద్రేశ్వరులకు ప్రత్యేక పూజలు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భద్రకాళి మాత, వీరభద్రేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు.

◆ **ప్రజలకు అందుబాటులో ఉండాలి**

ఝరాసంగం(జహీరాబాద్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని ప్యారవరం, ఎల్గోయి తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల శివారులోని వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు సాగించకుండా ఏర్పాటుచేసిన బారికేడ్లు పరిశీలించారు. అదేవిధంగా ఎల్గోయి గ్రామంలో వర్షానికి పాక్షికంగా కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు అధికారులను కోరారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీకాలనీలో పర్యటించారు. అనంతరం ఎల్ఐజీ వార్డు కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ **ధరలను నియంత్రించడంలో విఫలం**

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్‌ఖాన్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.‌ార్యక్రమంలో ముజాహిద్, మల్లేష్, శంకరయ్య, రజియా, శోభ , పోచమ్మ పాల్గొన్నారు.

◆ **పారిశుద్ధ్య పనుల పరిశీలన**

సంగారెడ్డి : హత్నూర మండలంలోని గుండ్ల మాచునూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ శంకర్ సోమవారం పరిశీలించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీఈఓ యూసుఫ్, కార్యదర్శి రమణారెడ్డి ఉన్నారు.

◆ **మెడికల్ క్యాంపులు నిర్వహించాలి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : జిల్లాలో విష జ్వరాలు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల ప్రాణాలు కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు కోరారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుమార్, ఎం .మహేష్ పాల్గొన్నారు.

◆ **ఆలయాల్లో భక్తుల సందడి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్‌లోని సిద్ధివినాయక ఆలయం, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం భక్తులతో సందడిగా మారాయి. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయాలకు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అన్నదానం చేశారు.

◆ **నీటిని తొలగించిన యువకులు**

జహీరాబాద్: కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామ రహదారిపై వర్షం నీరు నిలిచి రాక పోకలకు ఇబ్బందులు కలగడంతో యువకులు శ్రమదానంతో నీటిని తొలగించారు. అధికారులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో శ్రమదానంతో రాకపోకల ఇబ్బందులు తొలగించారు.

◆ **దెబ్బతిన్న పంటల పరిశీలన**

జహీరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఏడీఏ భిక్షపతి, ఏఈఓ ప్రదీప్‌కుమార్‌లు పరిశీలించారు. సోమవారం రంజోల్, పస్తాపూర్ తదితర గ్రామాలను సందర్శించి పంటల పరిస్థితిని చూశారు.

◆ **యువకుడు అదృశ్యం**



సాయి ప్రమోద్

పటాన్‌చెరు టౌన్: యువకుడు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ మాదాపూర్ హిల్స్‌కి చెందిన కామేశ్వర సాయి ప్రమోద్ సోమవారం ఉదయం సోదరుడు ప్రశాంత్ బైక్‌తోపాటు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు తీసుకొని ఇంటి నుంచి వెళ్లాడు. బయటకు వెళ్లిన కొద్ది గంటలకే అమీర్‌పేట్ పరిధిలోని ఓ మొబైల్ స్టోర్‌లో సెల్ ఫోన్ కొనుగోలు చేసినట్లు ప్రశాంత్‌కు మెసేజ్ వచ్చింది. సోదరుడి కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400